క్లుప్తంగా

కలెక్టర్ షన్మోహన్‌ను కలిసిన ఎన్‌జీఓ సంఘ ప్రతినిధులు



కలెక్టర్‌ను కలిసిన ఎన్‌జీఓ సంఘ నాయకులు

కాకినాడ సిటీ: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సగిలి షన్మోహన్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్‌జీఓ సంఘ ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కలెక్టర్‌ను కలిసినవారిలో అసోసియేషన్ ప్రతినిధులు గుద్దటి రామ్‌మోహన్‌రావు, పేపకాయల కృష్ణ, మట్టపర్తి వెంకటేశ్వరరావు, సరెళ్ల చంద్రరావు, పి పాండురంగారావు, నీలపాల వీరబాబు, బి శ్రీనివాసరావు, అరదాడి సత్తిరాజు, వై రామకృష్ణ తదితరులున్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం



శ్రీనగర్ మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ట్రస్ట్ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక శ్రీనగర్ మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో పైడా వెంకటనారాయణ సుశీల రాఘవరత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.1.30 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించారు. పాఠశాలలో చదువుకుంటున్న సుమారు 600 మంది విద్యార్థులకు శుద్ధమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పైడా రామకృష్ణ అన్నారు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసిన ట్రస్ట్ సభ్యులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పైడా శ్రీనివాస రామకృష్ణ, పైడా సోమేశ్వరరావు, డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనురాధ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఈబీ, పోలీసు సిబ్బంది

కరప: మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితాలు అంధకారమవుతాయని, అటువంటివాటికి దూరంగా ఉండాలని తాళ్లరేవు ఎస్ఈబీ(స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్) ఎస్ఐ టి.చిట్టిబాబు, కరప ఎస్ఐ టి.రామకృష్ణ పేర్కొన్నారు. కరప మండలం యండమూరులో సోమవారం ఎస్ఈబీ, కరప పోలీస్‌స్టేషన్ సిబ్బందితో ఎస్ఐలు పర్యటించి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు చిట్టిబాబు, రామకృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రజలు సహకరించాలన్నారు. డ్రగ్స్ కలిగి ఉన్నా, అమ్మకాలు జరిపినా, డ్రగ్స్ సంబంధిత నేరాలను ప్రోత్సహించినా 10 నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తారన్నారు.

శాశ్వత ప్రాజెక్టులపై దృష్టి సారించాలి



క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణకు అధికార దండం అందిస్తున్న బాదం బాలకృష్ణ

బోట్‌క్లబ్: ప్రజలకు అవసరమైన శాశ్వత ప్రాజెక్టులపై క్లబ్ సభ్యులు దృష్టి సారించాలని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక చల్లా ఫంక్షన్ హాల్‌లో సోమవారం లయన్స్ ఎలైట్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షుడిగా మైలవరపు సత్యనారాయణ, కార్యదర్శిగా కేవీఆర్ వరప్రసాద్, కోశాధికారిగా టీవీవీ సత్యనారాయణలతో బాదం బాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించి అధికారం దండం అందించారు. సమాజంలో అవసరమైన సేవా కార్యక్రమాలు చేయడంలో క్లబ్ సభ్యులు ముందుంటారన్నారు. కార్యక్రమంలో క్లబ్ కౌన్సిల్ చైర్మన్ దామెర శ్రీకాంతి పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీలు

కొత్తపల్లి: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలో కొమరగిరి, కుతుకుడుమిల్లి జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఎంపీపీ పాఠశాలలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు బాల్య వివాహాలు చేయడం చట్టపరంగా నేరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది గణనీయంగా పెరిగిందని తెలిపారు.

హే బిడ్డా.. ఇది మా అడ్డా..

- నగరంలో రహదారులపైనే పశువుల సంచారం
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

బోట్‌క్లబ్: ఒకటి కాదు.. రెండు కాదు.. పదుల సంఖ్యలో పశువులు నిత్యం రోడ్లపైనే సంచరిస్తున్నాయి. రాత్రి పగలు అన్న తేడా లేకుండా నడిరోడ్డుపైనే మకాం పెట్టేస్తున్నాయి. ఫలితంగా రోజూ నగరంలోని ఏదోచోట వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లపై సంచరించడమే కాదు అకస్మాత్తుగా వాటిలో అవే పోట్లాడుకొని అటుగా వెళ్లే వాహనదారులపై పడడంతో తీవ్ర గాయాలపాలవుతున్న ఘటనలు సైతం చోటుచేసుకుంటున్నాయి. రోడ్లపై పశువులను వదిలేస్తే చర్యలు తప్పవని కార్పొరేషన్ అధికారులు ఎన్నిసార్లు హెచ్చరిస్తున్నా పశువుల యజమానుల్లో మాత్రం మార్పు రావడం లేదు. రోజూ ఉదయమే పశువులను తీసుకొచ్చి పాలు పితుక్కుని మళ్లీ రోడ్లపై వదిలేస్తున్నారు. పశువులను పట్టుకుంటే మాత్రం మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని చెప్పి పశువులను ఇంటికి తీసుకెళుతున్నారు. ఆ తరువాత కథ మళ్లీ మామూలే.. కార్పొరేషన్ అధికారులు సైతం వాటిని తీసుకొస్తే ఎక్కడ ఉంచాలోనని, మేత ఖర్చు ఎవరు భరిస్తారన్న భయంతో వదిలేస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కాకినాడ నగర ప్రజలు కోరుతున్నారు.



విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల ప్రధాన రహదారిలో పశువుల సంచారం

- ఇటీవల నగరంలోని విద్యుత్‌నగర్ ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కళాశాలకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. రోడ్డుపై ఆవులు నిద్రిస్తుండడంతో వాటిని తప్పించుకుని వెళుతుండగా అవి ఒక్కసారిగా పైకి లేచి వాహనాన్ని ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు విద్యార్థులు రోడ్డుపై పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు. నిత్యం ఇలా ప్రమాదాల బారిన పడుతున్న వారి సంఖ్య అధికంగానే ఉంటుంది.
- కాకినాడ నగరంలో సుమారు 5 లక్షల మందికి పైగా నివసిస్తున్నారు. స్మార్ట్ సిటీ పుణ్యమా అని రోడ్లు బాగున్నా పశువుల కారణంగా వాహనాలపై ప్రయాణించేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన కూడళ్లయిన భానుగుడి సెంటర్‌తో పాటు శివారు ప్రాంతాల్లో ఎల్‌బీనగర్, విద్యుత్‌నగర్ తదితర ప్రాంతాల్లో పశువుల సంచారం రోజురోజుకీ పెరిగిపోతోంది. అయినా ఈ సమస్యను అధికారులు లైట్ తీసుకుంటున్నారు.
- కార్పొరేషన్ అధికారులతో పాటు, స్వచ్ఛంద సంస్థలు కాకినాడ నగరంలో భారీగా మొక్కలను పెంచుతుంటే పశువులు వాటిని తినేస్తున్నాయి. మొక్కలు ఏపుగా పెరుగుతున్న సమయంలో వాటిని తినేయడంతో అవి చనిపోతున్నాయి. నగరంలోని ప్రజలు ఆరుబయట తమ ఇళ్ల వద్ద పెంచుకుంటున్న మొక్కలను సైతం పశువులు తినేస్తున్నాయి.



ఎల్‌బీ నగర్ నుంచి జేఎన్‌టీయూకేకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో తిష్ట వేసిన పశువులు

భయం భయంగానే ప్రయాణం



రోజూ విద్యుత్‌నగర్ ప్రధాన రహదారి లేదా ఒక్కొక్కసారి నాన్సీ స్ట్రీట్ ద్వారా ఐడియల్ కళాశాలకు ద్విచక్ర వాహనంపై వెళతాను. ఈ రెండు రహదారుల్లోనూ పశువులు సంచరిస్తుంటాయి. ఒక్కసారిగా అవి మీదకు వచ్చేస్తుంటాయి. అందుకే రోజూ భయంభయంగానే ప్రయాణం చేయాల్సి వస్తుంది.

– కె.సాయి, విద్యార్థి

నిత్యం ఇబ్బంది తప్పడం లేదు



నేను విద్యార్థులను నా ఆటోలో కళాశాలలకు తీసుకెళుతుంటాను. నగరంలోని రహదారులపై పశువుల సంచారం ఎక్కువైపోయింది. ఒక్కోసారి రోడ్డుకు అడ్డంగా ఉంటుండడంతో ఆటో ముందుకు వెళ్లే వీలుండటం లేదు. దీంతో వాటిని చెదరగొట్టి రోడ్డుపై ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– టి.కృష్ణ, ఆటోడ్రైవర్

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

- ఇన్‌చార్జ్ కమిషనర్ పి.సత్యకుమారి
- కార్పొరేషన్‌లో డయల్ యువర్ కమిషనర్

కాకినాడ: ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదుకు సత్వర పరిష్కారాన్ని అందిస్తామని కాకినాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్, ఎస్ఈ పి.సత్యకుమారి చెప్పారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల వరకూ ఫోన్ ద్వారా వచ్చిన వినతులను ఇన్‌చార్జ్ కమిషనర్ సత్యకుమారి స్వీకరించారు. డంపింగ్ యార్డ్, పారిశుధ్యం, వీధి దీపాల సమస్య వంటి దాదాపు 26 సమస్యలను ప్రజలు ఫోన్ ద్వారా వివరించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఇన్‌చార్జి కమిషనర్ సత్యకుమారి ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. అనంతరం పదిన్నర నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, యూపీఏ విభాగ సమస్యలకు సంబంధించి మొత్తంగా ఆరుగురు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కమిషనర్ సత్యకుమారి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన సమస్యలను రెండు మూడు రోజుల వ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్థికపరమైన అంశాలపై అవసరమైన అంచనాలను రూపొందించి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహరావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఈఈ మాధవి, మేనేజర్ కర్రి సత్యనారాయణ, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ షన్మోహన్

బోట్‌క్లబ్: కాకినాడ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకునే ముందు సగిలి షన్మోహన్ సోమవారం స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. తొలుత రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతాభిషేకాలు, అనంతరం బాలాత్రిపుర సుందరి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్రను ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం కలెక్టర్‌కు వివరించారు. తొలుత ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు.



అమ్మవారి చిత్రపటాన్ని కలెక్టర్ షన్మోహన్‌కు అందిస్తున్న ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి

వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు

కాకినాడ రూరల్: వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీఎంసీ వైద్యుడు కుమార్ యాదవ్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో బీపీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షంలో తడవడం, కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం వల్ల జ్వరాలు, విరేచనాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతిఒక్కరూ ఆహార నియమాలు పాటించడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రమణయ్యపేట శిబిరంలో పేదలకు బీపీ పరీక్షలు చేస్తున్న కుమార్ యాదవ్

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమీక్షకు హాజరైన పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఉపాధి హామీ సిబ్బంది

కరప: జిల్లాలోని కొన్ని మండలాల్లో అతిసార వ్యాధి కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం గ్రామ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, గ్రామ సచివాలయాలు, ఉపాధి హామీ పథక సిబ్బందితో ఆయన సమావేశమై వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో తాగు నీటి కాలుష్యం లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంచి నీటి పైపులైన్లు, వీధి కుళాయిలకు లీకులుంటే అరికట్టాలన్నారు. క్లోరినేషన్ చేసిన తర్వాతే తాగునీటిని సరఫరా చేయాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. అనంతరం ఉపాధి హామీ పథక సిబ్బందితో సమీక్షించి గ్రామాల్లో వేయాల్సిన సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లను గుర్తించి ప్రతిపాదనలు ఇవ్వాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వీవీఎస్ వర్ధన్, ఉపాధి పథకం ఏపీఓ జీవీ రమణకుమార్, ఈఓపీ ఆర్డీ బీఏ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కరపలో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధుడు

కరప: కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతున్నట్లు కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. కరప మండలం పెద్దాపురప్పాడు గ్రామ శివారున గుర్తుతెలియని వృద్ధుడు వాంతులు చేసుకుని రోడ్డుపక్కన అపస్మారక స్థితిలో పడి ఉండగా గ్రామస్తులు గుర్తించి 108 వాహనంలో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారన్నారు. సదరు వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే కరప పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని ఎస్ఐ రామకృష్ణ కోరారు.

మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన

గోకవరం: మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని కోరుకొండ ఐసీడీఎస్ సీడీపీఓ ఝాన్సీరాణి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో సోమవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనుషుల అక్రమ రవాణా ప్రపంచంలోనే అతిపెద్ద నేరమన్నారు. ప్రతిరోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు అక్రమ రవాణాకు గురతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ వరలక్ష్మి మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా తమ సంస్థ గత 28 సంవత్సరాలుగా పోరాటం చేస్తోందన్నారు. ప్రస్తుతం యువత మొబైల్, ఇంటర్నెట్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారన్నారు. అక్రమ రవాణాకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కో ఆర్డినేటర్లు శివ, సుప్రియ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గొల్లప్రోలు: పట్టణంలో సోమవారం పాదాంబిక అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. గొల్లప్రోలు పట్టణంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పండితులు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తిరుప్పావడ సేవా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మొగిలి అయ్యారావు, సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

రైతులకు కౌలు హక్కు గుర్తింపు కార్డులు

- మండలంలో 6,100 సీసీఆర్ కార్డుల లక్ష్యం
- తహసీల్దార్ శ్రీనివాసు

సామర్లకోట: మండల పరిధిలోని కౌలు రైతులకు 6,100 కౌలు రైతు హక్కు గుర్తింపు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు తహసీల్దార్ వై.శ్రీనివాసు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కౌలు రైతుల కార్డులపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి గ్రామంలోను వీఆర్వోలు, వీపీఏలు కలిసి గ్రామస్తులతో చర్చించి కౌలు రైతుల ను గుర్తించి కౌలు రైతు కార్డుల పంపిణీ చేయాలన్నారు. మండల వ్యవసాయ శాఖాధికారి ఐ.సత్య మాట్లాడుతూ కౌలు రైతు కార్డులు తీసుకున్న కౌలు రైతులకు పంటపై మాత్రమే హక్కు ఉంటుందని చెప్పారు. ఈ కార్డు ఆధారంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం ఉంటుందని, ఆ రుణాన్ని సకాలంలో చెల్లించాల్సిన బాధ్యత కౌలు రైతు పైనే ఉందన్నారు. కౌలు రైతు హక్కు కార్డు ఉన్నా భూమిపై ఎటువంటి హక్కు ఉండదని చెప్పారు. ప్రభుత్వ అన్ని పథకాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీనివాసు, మండల వ్యవసాయ విస్తరణాధికారులు సతీష్, శాంతి కమల, వీపీఏలు, ఆర్వోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సత్య

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

సామర్లకోట: పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉన్నదని మానవహక్కుల సంఘ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా మానవహక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ చెత్త పెరిగిపోయిందని, డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమీప ప్రాంతాల్లో అతిసార వ్యాధి వ్యాప్తి చెందుతున్న కారణంగా తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. నాగార్జున ఫిల్టరు చెరువులో చేపల వేట సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, చేపల వేటను నిలుపుదల చేయించి స్వచ్ఛమైన తాగు నీరు అందించాలన్నారు. అదే విధంగా హోటల్స్, మిఠాయి దుకాణాల్లో తినుబండాలపై తనిఖీలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మానవహక్కుల సంఘ నాయకులు ఎస్.రెహమాన్ జుత్తుక అప్పారావు, కౌన్సిలర్ బలుసు వాసులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలి

కరప: కుల, ఈబీసీ వంటి ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం లేకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, రాష్ట్రీయ హిందూ చైతన్య సదస్సు అధ్యక్షుడు పడాల రఘు కోరారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల వారికిచ్చే(ఈడబ్ల్యూఎస్) సర్టిఫికెట్ కోసం ప్రభుత్వం మంజూరు చేసిన తెల్ల రేషన్ కార్డు ఉండగా లాయర్ నోటరీ అఫడవిట్ అడగడం ఎందుకని ప్రశ్నించారు. సంవత్సరాదాయం రూ.లక్ష లోపు ఉండి, ఎటువంటి ఆస్తిపాస్తులు లేకుండా, తెలుపు రేషన్‌కార్డు కల్గినవారు పేదవారే కదానన్నారు. గతంలో మాదిరి మీసేవ కేంద్రాల ద్వారా అన్ని సేవలను అందుబాటులో తీసుకురావాలన్నారు. ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాల కాల పరిమితి మూడేళ్లకు పెంచాలన్నారు. కార్యక్రమంలో ముమ్మిడి పెద్దకాపు, బుద్దాల సత్తిబాబు, కాదా సత్యనారాయణ, గౌతు చిన్న తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ రామకోటేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ, హిందూచైతన్య సదస్సు నాయకులు

వై.సావరంలో నేను బడికి పోతా


కరప: మండలం పెద్దాపురప్పాడు శివారు వై.సావరంలో సోమవాకం విద్యాశాఖాధికారులు, ప్రజాప్రతినిధులు నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, గ్రామస్తులు, సీఆర్పీలు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిసి విద్య వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి ఐదేళ్లు నిండిన పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ఈ సందర్భంగా బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులతో దరఖాస్తు ఫారంలపై సంతకాలు తీసుకున్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు బడిలో, పిల్లల భద్రత బడిలో ఉందంటూ నినాదాలు చేశారు. వచ్చే నెల 12వ తేదీ వరకూ ప్రతి గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎంఈఓలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పి.పద్మావతి, హెచ్ఎంలు వరలక్ష్మి, ఎంఏ అలీం, సీఆర్పీలు పి.రాజు, బి.సారాకుమారి తదితరులు పాల్గొన్నారు.



వై.సావరంలో పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓలు

బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్ అందజేత

కరప: కృత్తివెన్ను రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి సోమవారం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియో సొమ్మును తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు అందజేశారు. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద ఈ నెల 14వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన గండి ధర్మవరప్రసాద్ మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో ప్రకటించింది. తహసీల్దార్ రామకోటేశ్వరరావు సోమవారం గొర్రిపూడి వెళ్లి మృతుడు ధర్మవరప్రసాద్ భార్య వరలక్ష్మికి సదరు చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో డీటీ కె.అనిల్‌కుమార్, జేఎస్‌పీ నాయకుడు పంతం సందీప్, టీడీపీ నాయకుడు గండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గొర్రిపూడిలో బాధిత కుటుంబానికి చెక్‌ను అందజేస్తున్న తహసీల్దార్ రామకోటేశ్వరరావు